నాల్గవ అర్ఘ్యం:- **రక్తవర్ణం సమానీతం గంధ పుష్పాక్షతైర్యుతం**
అర్ఘ్యం గృహాణ భగవన్ సర్వపాప వ్యపోహకృత్

ఈ విధంగా నాలుగు అర్ఘ్యాలు ఇవ్వటంవల్ల అన్ని ఉపద్రవాలు, రోగబాధలు, శత్రుపరాభవాలు, ఋణబాధలు తొలగిపోతాయి.

ఋణవిమోచన కుజగ్రహ తంత్రం :

ఎవరైనా ఋణబాధలతో సతమతమవుతూ వుంటే ఈ విధంగా తాంత్రిక ప్రక్రియను చేయాలి. ఎర్రచందనం కర్రతో కుజగ్రహ ప్రతిమను చేయించి దానిని దక్షణ దిక్కుగా స్థాపించాలి. మంగళవారం మొదలుపెట్టి 40 రోజులు క్రమంగా కుజగ్రహ పూజ విధివిధానంగా చేయాలి. రాత్రిపూట చంద్రకర్రకాల్చిన బొగ్గులతో ఉత్తర దక్షిణాలుగా మూడు గీతలు గీసి, వాటి మధ్యలో ఋణపడిన ధనసంఖ్య మొత్తం రాసి ఎడమకాలి మడమతో ఉత్తరం నుండి దక్షిణ దిక్కుగా చెరిపి వెయ్యాలి. ఈ విధంగా చెరిపి వేయుటకు ముందు **'రక్తమాల్యాంబరధరం'** అన్న స్తోత్రం పఠించాలి. పగటిపూట అంగారకపూజ, రాత్రిపూట ఋణ సంఖ్యను చెరిపివేయుట అనెడి క్రియలను నలభైరోజులు క్రమంగా చేయటం వల్ల ఎంతటి అప్పుల బాధయినా తీరుతుందని తంత్రశాస్త్రం చెబుతుంది.

కుజగ్రహ ఉపవాసం :

కుజగ్రహ ఉపవాసం ద్వారా బాధానివృత్తి పొందవచ్చు. ఈ ఉపవాసాన్ని శుక్లపక్ష మొదటి మంగళవారం ప్రారంభించి 21 లేదా 45 మంగళవారాలు నియమంగా పాటించాలి. పగలంతా ఉపవసించి, రాత్రికి బెల్లంతో చేసిన హల్వా తినాలి. రాత్రికి హల్వా తినేముందు కుజగ్రహ తాంత్రిక మంత్రాన్ని 9మాలలు (108×9) జపించాలి. ఆ తరువాత బెల్లాన్ని ఎద్దుకు పెట్టాలి. అనుకొన్న మంగళవారాలు పూర్తయ్యాక హోమంకాని, అన్నదానం కాని చెయ్యాలి. బెల్లం, కొబ్బరికాయలు, కందులు, ఎర్రటిబట్టలు, రాగిసామాన్లు, గోధుమలు మొదలైన ద్రవ్యాలు దానం చెయ్యాలి. ఈ ఉపవాస నియమం వల్ల కుజగ్రహ బాధానివారణ జరుగుతుంది.

అవివాహితులు కుజదోష నివారణకు చేయాల్సిన పరిహారాలు

కుజదశ ఏడు సంవత్సరాలు కనుక కుజుడికి అధిపతి అయిన కుమారస్వామి అష్టకం ఏడుసార్లు పారాయణం చేయాలి. సుబ్రహ్మణ్య ఆలయ స్తుతి దర్శనం చేయాలి. షష్ఠి, సుబ్రహ్మణ్య షష్ఠి, సుబ్రహ్మణ్య జననం జరిగిన కృత్తికా నక్షత్రం రోజున ఆలయానికి ప్రదక్షిణ చేయాలి. ఎర్రని పుష్పాలమాలతో సుబ్రహ్మణ్య స్వామిని పూజించాలి. కుజుని అధిపతి అయిన సుబ్రహ్మణ్యస్వామికి ఉపవాసం ఉండి కందిపప్పు బెల్లంతో చేసిన పదార్థాలను నైవేద్యం పెట్టాలి. కార్యాలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి పటం ఉంచి ధూపదీప నైవేద్యాలు సమర్పించి కార్యక్రమాలు ప్రారంభించాలి. మంగళవారాలు సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను దర్శించాలి. ఎర్రని వస్త్రాలను, ఎర్రని పళ్ళను సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో దానం చేయాలి. స్త్రీలు ఎర్రని వస్త్రధారణ, పగడపు ఆభరణాలు ధరించి చేసి దుర్గాదేవిని పూజించుట, అమ్మవారికి ఎర్రని మాలలను సమర్పించి కుంకుమపూజ చేయాలి. దుర్గాదేవిని స్తుతించాలి.

మంగళవారాలు దుర్గాదేవి ఆలయదర్శనం చేసి ప్రదక్షిణం చేసి స్తుతించి పూజించాలి. గణపతి స్తోత్రం చేయాలి. ఆంజనేయస్వామి దండకం స్తుతి చేయాలి. బలరామ ప్రతిష్ఠిత నాగావళీ నదీతీర పంచలింగాలను దర్శించాలి. మంగళవారాలలో సింధూరవర్ణ ఆంజనేయస్వామి దర్శనం, ప్రదిక్షిణం, స్తుతి చేయాలి. మంగళవారం లేక కృత్తికా నక్షత్రం రోజున కుజుడికి శివాలయం లేక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఏడువేల కుజ జపం చేయించి ఎర్రని వస్త్రంలో కందిపప్పు మూటకట్టి దక్షిణ తాంబూలాదులతో బ్రాహ్మణులకు దానం ఇవ్వాలి. ఏడు మంగళవారాలు కుజుడికి ఉపవాసం ఉండి కుజ శ్లోకం డెబ్బై మార్లు పారాయణం చేసి ఏడవ వారం కందులు దానం ఇవ్వాలి. నానవేసిన కందులను బెల్లంతో కలిపి ఆవుకు తినిపించాలి. కోతులకు తీపి పదార్థములు పెట్టాలి. ఎర్రమి కుక్కకు ఆహారం పెట్టాలి. మంగళవారం రాగిపళ్ళెంలో కందిపప్పు పోసి దక్షిణ తాంబూలాలతో యువకుడికి దానం ఇవ్వాలి.

బుధగ్రహ బాధలు - పరిహారాలు

1. బుధునకు అధిదేవత విష్ణువు, ప్రత్యధిదేవత నారాయణుడు. అధిప్రత్యధి దేవతా సహితంగా వైదిక మంత్ర జపహోమాదులు చేయటంవల్ల బుధగ్రహ బాధా నివారణ జరుగుతుంది. ఆ విధంగా చేయలేనివారు విష్ణుసహస్రనామం, విష్ణుపంజరస్తోత్రం పఠించటం వల్ల నివారణ పొందవచ్చు. లేదా నారాయణ అష్టాక్షర మంత్రాన్ని రోజుకు కనీసం 3 లేక 11 మాలలు జపించటంవల్ల కాని, పురుష సూక్తాన్ని రోజుకు ఆరుసార్లు పఠించటంవల్ల కాని బాధా నివారణ కలుగుతుంది.
2. బుధగ్రహానికి అంతరిక్ష అధిదేవత 'షోడశీ' మహాదేవి. జ్యోతిష, వైద్య, వైజ్ఞానిక, గణిత, నాటక, సంగీత, న్యాయ, మీమాంస శాస్త్రాధ్యయనం చేసేవారు ఈ మహాదేవిని శాస్త్రోక్తంగా ఆరాధించుటవల్ల బుధగ్రహ బాధానివారణ జరిగి మేధాశక్తి పెంపొందుతుంది.
3. 5 రాగినాణాలు తీసుకొని, ప్రతిరోజూ ఒక నాణాన్ని తెల్లవారుజామున నిద్రలేవగానే మధ్యలో కన్నంకొట్టి ప్రవహించే నీటిలోనికి పారవేయాలి. బుధవారం నుంచి 5 రోజులు క్రమంగా చేయాలి. ఈ విధంగా నెలకొకసారి చేయటంవల్ల బాధాం నివారించబడుతుంది.
4. బుధగ్రహపీడ పొందేవారు పెద్దత్రాసులో కూర్చొని, మనిషి బరువెత్తు పెసలు తూకంవేసి, దక్షిణసహితంగా బ్రాహ్మణునకు దానమివ్వటం వల్ల బాధలు నివారించబడతాయి.
5. బుధగ్రహబాధాం వల్ల వ్యాపారంలో అడ్డంకులేర్పడితే 1 అంగుళం కొలతగల క్యూబు ఆకారాలను వెండితో చేయించి తెల్లగుడ్డలో చుట్టి, ఒక కర్రపెట్టెలో పెట్టి దానిని నీ వ్యాపారస్థలంలో వున్న గల్లాపెట్టెలో పెడితే మంచి జరుగుతుంది.
6. తులసిచెట్టుని ప్రతిరోజు పూజించి అర్ఘ్యం ఇవ్వాలి.
7. పచ్చని గుమ్మడికాయ బీదవారికి దానము చేయాలి.
8. ఆవుకు మేతగా పచ్చని కాయగూరలు పెట్టాలి.
9. పెళ్ళికాని ఆడపిల్లలకు పెళ్ళి ఖర్చులకు సహాయం చేయాలి.
10. చెలామణీలో లేని పాత నాణాలు నీటిప్రవాహంలోకి పారవేయటం వంటి తాంత్రిక క్రియలవల్ల బుధగ్రహ బాధానివారణ పొందవచ్చును.

బుధగ్రహ దానాలు :

1. బుధగ్రహ బాధానివారణకు శుక్లపక్ష ప్రథమ బుధవారంనాడు, ఉదయంపూట 600గ్రాముల లేక 6కిలోల పెసలు, గాజు లేదా పింగాణీ పళ్లెంలో పోసి, తమలపాకులు, ద్రాక్షపండ్లు పెట్టి, బుధుని విధివిధానంగా పూజించి, ఉత్తరదిశగా తిరిగి బ్రాహ్మణుని పాదాలు కడిగి దానం చేయాలి. ఈ విధంగా 8 లేదా 17 బుధవారాలు చేయటంవల్ల బాధానివారణ జరుగుతుంది.
2. బుధునకు యిష్టమైన సంపెంగపూలు, పెసరపప్పుతో చేసిన వంటకాలు, ఆవునేయి, ద్రాక్షరసం, ఆరువత్తులు వేసిన దీపం, ఉత్తరేణి పుల్లలు, స్పటికాలు, గాజు పింగాణీ పాత్రలు, తమలపాకులు మొదలగు వస్తువులను బుధునకు సమర్పించి దానం చేయుటవల్ల నివారణ కలుగుతుంది.

బుధగ్రహ ఉపవాసం :

బుధగ్రహ బాధానివారణకు చేయవలసిన ఉపవాసాన్ని శుక్లపక్ష ప్రథమ బుధవారంనాడు ప్రారంభించి ఇరవైఒకటి లేదా నలభైఐదు బుధవారాలు పాటించాలి. రోజంతా ఉపవాసముండి, సాయంత్రం స్నానం చేసి అన్నం పెసరపప్పు వేసుకొని భోజనం చెయ్యాలి. ఆకుకూరలు తినవచ్చును. పెరుగు, మజ్జిగ పనికిరాదు. బుధవారం ఉదయం ఆకుపచ్చరంగు కల బట్టలు ధరించి, బుధుని తాంత్రిక మంత్రాన్ని మూడు లేదా పదిహేడు మాలలు (108×3) పునశ్చరణ చేయాలి. సాయంత్రం కూడ ఈ విధంగానే చేయాలి. సాయంత్రం పెసరపప్పుతో చేసిన బూరెలు, గారెలు వంటి పదార్థాలు ఇతరులకు పంచిపెడితే మంచిది. అనుకొన్న వారాలు పూర్తయిన తరువాత, చివరి బుధవారం బుధగ్రహ ఆరాధన, హోమం చేయుటవల్ల పూర్ణఫలం లభిస్తుంది. ప్రతి నెలా అమావాస్యనాడు ఉపవాసం చేయటంవల్ల కూడ బుధగ్రహ బాధానివారణ జరుగుతుంది.

బుధగ్రహ స్నానం :

నదీసంగమ స్థలంలోని నీరు మట్టికుండతో తెచ్చి, సంగమస్థలంలోని మట్టినికూడ కొద్దిగా ఆ నీటిలో కలిపి, దానిలో ఉసిరిక పప్పు, తులసి విత్తనాలు కలిపి, బాణాకారంగా ముగ్గువేసి, దానిపై దర్భలు పెట్టి వాటిమీద నీళ్ళకుండ పెట్టి బుధుని విధి విధానంగా పూజించి, బ్రాహ్మణుని అనుజ్ఞపొంది, ఉత్తరదిశగా తిరిగి శిరఃస్నానము చేయాలి. ఈ విధంగా ఎనిమిది బుధవారాలు చేయటంవల్ల బుధగ్రహ బాధానివారణ జరుగుతుంది.

గురుగ్రహ బాధలు - పరిహారాలు

1. తంత్రశాస్త్ర ప్రకారం గురుగ్రహానికి అంతరిక్ష అధిదేవత తారామహాదేవి స్త్రీలకు భర్త సుఖం, సాంఘికంగా ఉన్నతి, ప్రాణాపాయ పరిస్థితులు వచ్చినపుడు, పరిస్థితులు చేజారిపోయినపుడు ఈ శక్తిని ఆరాధించాలి. తారామహాదేవి స్తోత్రం కాని, కవచంకాని, హృదయం కాని పఠించుటవల్ల బాధానివారణ జరుగుతుంది.
2. గురుగ్రహానికి అధిష్ఠాన దేవత సాంబశివుడు. అనగా శక్తి సహితమైన శివుడు. ఈ భావాన్నే శ్రీ జగద్గురు శంకరాచార్యుల వారు ప్రథమశ్లోకంగా ప్రవచించారు. శక్తిపంచాక్షరీ మంత్రాన్ని కాని, స్తోత్రాన్ని కాని పఠించాలి. 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని మరియు "ఓం హ్రీం గౌర్యై నమః' అనే శక్తి మంత్రాన్ని కలిపి జపించాలి. లేదా 'శివశ్శక్త్యోయుక్తో యది భవతిశ్యా' అనే సౌందర్యలహరి శ్లోకాన్ని రోజుకు 50మార్లు పునశ్చరణ చెయ్యాలి. ఈ విధంగా చేయుటవల్ల గురుగ్రహ బాధా నివారణ కల్గును.
3. గురునకు అధిదేవత బ్రహ్మ. ప్రత్యధిదేవత ఇంద్రుడు. అధి, ప్రత్యధిదేవతా సహితంగా గురుగ్రహానికి జపహోమాదులు చేయుటవల్ల నివారణ పొందవచ్చును.

గురుగ్రహ దానం:

1. తొమ్మిది సంఖ్యగల కొలతతో 900 గ్రా॥ / 9 కిలోలు శెనగపప్పు రాగిచెట్టు ఆకులతో కుట్టిన విస్తరిలోపోసి, గురువారంనాడు, గురుహోరలో వేదం చదివిన మధ్య వయసు కలిగిన బ్రాహ్మణుడికి, గురుగ్రహ మంత్రజపాన్ని చేసి, ఉత్తరదిక్కుగా తిరిగి దానం చేయాలి. ఈ విధంగా తొమ్మిది వారాలు చేయుటవల్ల ఫలితం వుంటుంది. గురుగ్రహానికి చెప్పబడిన వస్తు సముదాయాన్ని కూడ ఈ విధంగా దానమిచ్చుట వల్ల కూడ నివారణ జరుగును.
2. గురుగ్రహానికి సంబంధించిన వివిధ వస్తువులను దానం చేయుటవల్ల కూడ నివారణ పొందవచ్చును. చామంతి, బంతి, తెల్ల కలువు, శెనగపప్పు, వాటితో

చేసిన సకల పదార్థాలు, మారేడు దళములు, ఉసిరికపండ్లు, కొబ్బరి, చెరకు, మామిడి, బత్తాయి, నారింజ, కుంకుమపువ్వు, చిక్కని మజ్జిగ, తొమ్మిది వత్తుల దీపం, రావి సమిధలు, ఆవునెయ్యి, పసుపురంగు కల వస్త్రములు, వక్కలు, కాచుముక్కలు, కొబ్బరిబొండాలు మొదలగు వస్తువులు పూజలో సమర్పించుట వల్ల, దానంగా పంచిపెట్టుటవల్ల కాని నివారణ పొందవచ్చు.

గురుగ్రహ స్నానం :

గురువారంనాడు వెండిబిందెలో శక్తి లేనివారు ఇత్తడి బిందెలో రావిఆకులు, శతావరి, శతపుష్పము, గోరోచనము, కుంకుమపువ్వు మున్నగు ఔషధులు కలిపి, దీర్ఘ చతురస్ర ఆకారం కల ముగ్గువేసి, దర్భలువేసి, నీటిబిందెను పెట్టి, గురుగ్రహమును పూజించి, బ్రాహ్మణుని పాదాలు కడిగి, పసుపు వస్త్రాలు ధరించి, ఉత్తరముఖంగా తిరిగి శిరఃస్నానము చెయ్యాలి. ఈ విధంగా తొమ్మిది వారాలు చేయుటవల్ల గురుగ్రహ సంబంధ రోగాలు, బాధలు నివారణ కల్గును.

గురుగ్రహ ఉపవాసం :

శుక్లపక్ష ప్రథమ గురువారంనాడు శుద్ధి స్నానంచేసి, పసుపురంగు బట్టలు ధరించి, పగలంతా ఉపవాసం చేసి రాత్రికి మరల పూజచేసి శెనగపప్పు బెల్లంతో బూరెలు, లడ్డూలు నివేదించి అవే తినాలి. ఆ పదార్థాలు పంచిపెట్టాలి. పగలంతా గురుగ్రహ తాంత్రిక మంత్రాన్ని మూడు లేదా పదకొండు మాలలు (108×11) పునశ్చరణ చేయాలి. ఈ విధంగా చేయుటవల్ల ధన, వివాహ, ఉద్యోగ సంబంధ బాధలు నివారణ జరుగును.

గురుగ్రహ శాంతికి తాంత్రిక ప్రక్రియలు :

ఈ చెప్పబోయే తాంత్రికప్రక్రియలు రాశిచక్ర రీత్యాకాని, లగ్నరీత్యాకాని గురుగ్రహ స్థితినిబట్టి కాని అన్వయించుకోవాలి. అలాగే గురుగ్రహంపై యితర గ్రహాలదృష్టి, కలయిక, ఆధిపత్య స్థానాలను కూడా దృష్టిలో వుంచుకొని నివారణలు నిర్ణయించుకుని ఆచరించాలి.

1. గురువు వివిధ స్థానాల్లో బాధాప్రదుడుగా వుంటే ఈ విధమైన తాంత్రిక ప్రక్రియలు ఆచరించాలి. ద్వితీయస్థానంలో బాధాప్రదుడైతే కుంకుమపువ్వు నానబెట్టి తిలకంగా ధరించాలి. తృతీయంలో నైతే దుర్గాదేవికి పూజచేసి ఆడపిల్లలకు స్వీట్లు పంచిపెట్టాలి. (వృశ్చిక మీనలగ్నాలవారు తప్పక చేయాలి) చతుర్థంలోనైతే రావిమొక్కను పెరట్లోకాని, కుండీలోగాని వేసి ప్రతిదినం నీరు పోయాలి. పంచమంలోనైతే ప్రతిదినం దేవాలయాన్ని శుభ్రం చేయాలి. షష్ఠంలోనైతే దేవాలయ పూజారికి పసుపురంగు వస్త్రాలు దానం చేయాలి. అష్టమంలోనైతే నేయి, కర్పూరం దేవాలయానికి దానం చేయుట, ఇంటికి వచ్చిన బిచ్చగాండ్రకు దానం చేయుట, దశమంలో కేంద్రాధిపత్యబాధాం పడితే ప్రతిదినం ఒక రాగినాణెం బిళ్లను వరుసగా 43రోజులు నీటిలో పారవేయాలి. లాభస్థానంలోనైతే తండ్రివాడిన వస్తువులు వాడుటచేయాలి. వ్యయంలోనైతే సద్గురువు పూజ, సాధువులకు సేవ చేయుటవల్ల నివారణ కలుగుతుంది.
2. గురుచంద్రులు కలిసి జాతకచక్రంలో చెడిపోతే ఉత్తరదిక్కు ఈశాన్యంలో వెండిపాత్ర పాటిపెట్టుట వల్ల నివారణ కల్గును.
3. పంచమస్థానంకాని, పంచమాధిపతికాని, గురుడుకాని జాతకరీత్యా చెడిపోతే సంతానంపై ప్రభావం చూపెడుతుంది. పిల్లవాడు బరువంత శనగపిండి తూకం వేసి, ఆ పిండితో రోజుకు నాలుగురొట్టెలు చేసి కుక్కలకు పెట్టాలి. ఈ విధంగా 43రోజులు చేయుటవల్ల మంచి ఫలితముంటుంది.
4. గురుగ్రహ బాధ పొందేవారు ఏకాదశీతిథి గురువారంనాడు అశ్వత్థ (రావి) చెట్టుకొమ్మను తెచ్చి, పూజించి, ఇంటిగుమ్మం ముందు కట్టుటవల్ల గురుగ్రహ బాధా నివారణ కలుగుతుంది.

శుక్రగ్రహ బాధలు - పరిహారాలు

1. శుక్రునకు అధిదేవత ఇంద్రాణి, ప్రత్యధిదేవత ఇంద్రమరుత్తులు. అధిప్రత్యధి దేవతాసహితంగా జపహోమాదులు శుక్రునికి చేయుటవల్ల, ఇంద్రాణి కవచ స్తోత్రాలను పఠించుటవల్ల నివారణ కలుగుతుంది.
2. శుక్రునకు అధిష్ఠాన దేవత శ్రీ రాజరాజేశ్వరీ దేవి. ఆమె అష్టకాన్ని కాని, స్తోత్రాన్ని కాని ప్రతిదినం పఠించుటవల్ల నివారణ కలుగుతుంది.
3. తంత్రశాస్త్ర ప్రకారం శుక్రునకు అంతరిక్ష అధిదేవత కమలాత్మకాదేవి. జీవితంలో సుఖాలు పొందాలన్నా, కళాకారునిగ రాణించాలన్నా, ప్రేమ వ్యవహారాలు ఫలించాలన్నా, కమలామహాదేవి స్తోత్రం, మంత్ర కవచం పారాయణ చేస్తూ, శివకవచ పారాయణ చేయుటవల్ల నివారణ పొందగలరు.
4. శుక్రగ్రహబాధాం వల్ల స్త్రీలకు ఏ విధమైన బాధలు కలిగినా ఆవాలనూనె చుక్కలు, సూర్యోదయం కాకపూర్వం సింహద్వారమునకు కుడివైపున లోపల నుండి వేయాలి. ఈ విధంగా 43 రోజులు చేయుటవల్ల నివారణ కలుగుతుంది.
5. సప్తమంలో శుక్రుడు, అష్టమంలో రాహువు ఉన్నప్పుడు ఇంటిలోని ఆడవారు నలుపు, నీలిరంగు వస్తువులు, వస్త్రాలు వాడకూడదు.
6. శుక్రగ్రహబాధాం వల్ల ఆర్థికపరమైన అస్థిరత కల్గినప్పుడు వేపచెట్టుకు చిన్న కన్నంచేసి, దానిలో చిన్న చతురస్ర వెండిముక్కపెట్టి, తిరిగి చెట్టు బెరడుతోనే మూసివేయాలి. ఈ విధానం వల్ల ఆర్థికస్థితి మెరుగుపడుతుంది.

శుక్రగ్రహ ఉపవాసం:

శుక్లపక్ష ప్రథమ శుక్రవారంనాడు ప్రారంభించి 21 లేదా 31 శుక్రవారాలు ఉపవాస నియమం పాటించాలి. శుక్రవారంనాడు శిరఃస్నానం చేసి తెల్లటి వస్త్రాలు ధరించి, తాంత్రిక మంత్రాన్ని మూడు లేక ఇరవై ఒకటి మాలలు (108×21) జపించాలి. పగలంతా ఉపవాసం చేసి, సాయంత్రం మరల స్నానం చేసి మంత్రాన్ని మరల జపించి, అన్నంకాని, పంచదారతో చేసిన పరమాన్నం కాని భుజించాలి. భోజనానికి ముందు ఆవుకుగాని, ఏ కాక్షియైన వ్యక్తికి కాని పెట్టాలి. దీక్ష ముగిసిన రోజున పాలు, పెరుగు, వెండి, బియ్యం, తెల్లటి బట్టలు దానం చేయాలి. హోమం కూడ చేయటం మంచిది. ఈ విధానం వల్ల శుక్రగ్రహ బాధానివారణ జరుగుతుంది.

శుక్రగ్రహ దానాలు :

1. ప్రతిరోజు లక్ష్మీదేవికి పాలు నైవేద్యంగా పెట్టుటవల్ల, అనాధ బాలికలకు వస్త్రములు, పండ్లు, పూలు, పాలు, పెరుగు, బియ్యం దానము చేయుటవల్ల నివారణ కలుగుతుంది.

2. శుక్రగ్రహ బాధితులు తాము తినే ఆహారపదార్థముల నుండి కొంత తీసి ఆవుకు పెట్టుటవల్ల, ఆవులకు సంబంధించిన చిట్టు, తవుడు, పొట్టు, నూకలు, గంజి, కడుగు మొదలగు పదార్థాలు పెట్టుటవల్ల నివారణ జరుగును. ఈ విధంగా 40రోజులు చేయాలి.

3. శుక్లపక్ష ప్రధమ శుక్రవారంనాడు 600గ్రా॥ / 6కిలోలు బొబ్బర్లు పింగాణీ లేదా అరటి ఆకులోపోసి, శక్తి ననుసరించి తెల్లటి జరీఅంచుగల వస్త్రమును, పరిమళ ద్రవ్యములైన అత్తరు, గంధం, కుంకుమపువ్వు, జాజికాయ మున్నగు వస్తువులను తాంబూలం పెట్టి పెండ్లికాని పదహారు సంవత్సరాల బ్రాహ్మణ యువకునకు పాదప్రక్షాళనచేసి, శుక్రగ్రహమంత్ర, స్తోత్రములను పఠించి దానమీయవలెను. ఈ విధంగా 20 వారాలు చేయుటవల్ల నివారణ జరుగును.

4. ఉత్తమ కులంలోని కన్య రజస్వల అయినప్పుడు అన్నవస్త్రములు దానం చేయుటవల్లన, పచ్చగడ్డి ఆవులకు తినిపించుట వల్ల, చంటిపిల్లలకు పాలు ఇచ్చుటవల్ల శుక్రగ్రహ బాధా నివారణ కలుగుతుంది.

5. వ్యయంలో శుక్రుడున్నప్పుడు భార్య ఆరోగ్యం దెబ్బతీస్తాడు. అటువంటప్పుడు శుక్రగ్రహ సంబంధ వస్తువులు దానం చేయాలి. నీలిరంగు కల పువ్వును సూర్యాస్తమయం జరిగాక రాత్రికి ముందు ఏకాంత ప్రదేశంలో పాతిపెట్టుట వల్ల నివారణ కలుగుతుంది.

6. శుక్రుడు చతుర్థరాశియైన కర్కాటకమందున్నపుడు స్త్రీల వ్యవహారాల్లో తప్పటడుగులు వేయిస్తాడు. మేనమామలకు అనర్థాలు కలుగుతాయి. అటువంటప్పుడు చంద్రునికి సంబంధించిన ఆరాధనలు, దానాలు చేయుటవల్ల నివారణ కలుగుతుంది.

శనిగ్రహ బాధలు - పరిహారాలు

1. శనికి అధినేత యముడు. ప్రత్యధిదేవత ప్రజాపతి. అధి, ప్రత్యధిదేవతా సహితంగా శనికి జపహోమాదులు చేయుటవల్ల నివారణ కల్గుతుంది.
2. శనికి అధిష్టాన దేవత శ్రీ వేంకటేశ్వరస్వామి. శనివార నియమం పాటిస్తూ ప్రతిదినం ఏడుకొండల వాని పూజ, అభిషేకాదులు చేయుట వల్ల కూడా నివారణ పొందవచ్చును.
3. శనికి అంతరిక్ష దేవత శ్రీ దక్షిణాకాళికాదేవి. శ్రీ కాళీదేవికి సంబంధించిన అష్టోత్తరాది స్తోత్రాలు పఠించాలి.
4. శనిగాయత్రీ మంత్రం 19 శనివారాలు – 190సార్లు పారాయణ చేయాలి.
5. శనికి 19 సార్లు తైలాభిషేకం చేయించి నువ్వులు దానం ఇవ్వాలి.
6. శనిమంత్రం ఏదైనా (19వేలు జపం) 40రోజుల్లో పూర్తిచేయాలి.
7. శనిధ్యాన శ్లోకం 190 రోజులు 190 సార్లు పారాయణ చేయాలి.
8. నవగ్రహాలకు 19 శనివారాలు 190 ప్రదక్షిణలు చేసి, కేజింపావు నువ్వులు దానం చేయాలి.
9. ఆవాలు కలిపిన గేదె పెరుగన్నము పెటుట్టవల్ల, నువ్వు పప్పు ఉండలు పిల్లలకు పంచిపెట్టుటవల్ల నివారణ కల్గును.
10. గోధుమపిండితో చేసిన చిన్న ఉండలను చేపలకు వేయుటవల్లను, ప్రతిదినం అన్నం తినేముందు కాకులకు పెట్టుటవల్ల, ఇనుప పెనము, సారాయి, నూనె దానము చేయుటద్వారా శనిగ్రహపీడ నివారణ కలుగుతుంది.
11. కొబ్బరికాయలు, బాదం పిక్కలు పారుతున్న నీటిలోనికి ధారపోయుటవల్ల నివారణ కలుగుతుంది.
12. నువ్వులనూనెతో నిండిన చిన్న మట్టి పిడతను రాత్రిపూట కాలువ, లేదా నది గర్భంలో పాతిపెట్టాలి. దానిమీదుగా నీటి ప్రవాహం వెళ్ళుటవల్ల శనిగ్రహ పీడ నివారణ కలుగుతుంది.
13. చిన్నమట్టి ప్రమిదలతో తేనె నింపి, నిర్జన ప్రదేశంలో పాతిపెట్టటం వల్ల వైవాహిక జీవితం సక్రమంగా సాగుతుంది.

14. పంచదార కలిపిన పాలను అరటిచెట్టు మొదల్లోపోసి, తడిమట్టిని తిలకంగా ధరించుటవల్ల శనిగ్రహ బాధానివారణ జరుగుతుంది.

15. లగ్నం నుండి ఏకాదశమందుకాని, కుంభరాశియందుకాని శని వున్నపుడు, ఇంటి ప్రహరీగేటు దక్షిణ దిక్కుగా వుండరాదు. చిన్నసైజు వెండి ఇటుక చేయించి పూజాగ్రహమందుకాని, హాల్లో పశ్చిమదిక్కుగా గాని పెట్టుటవల్ల నివారణ కలుగుతుంది.

16. శనిగ్రహస్థితి బాగాలేనపుడు కాలభైరవ స్తోత్రము రోజుకు మూడుసార్లు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం లేదా రాత్రి పఠించుటవల్ల రొట్టెముక్కలపై నువ్వుల నూనె వేసి వీధిలోని కుక్కలకు పెట్టుటవల్ల శనిగ్రహ బాధా నివారణ కలుగుతుంది.

17. సాంఘిక, రాజకీయ, ఆర్థిక, శారీరక, మానసిక, కుటుంబ బాధలను శనిగ్రహం ఏ విధంగానైనా కల్గించినపుడు, నివారణ పొందుటకు పిప్పిలాద మహర్షి తంత్ర ప్రక్రియనొక దాన్ని ప్రసాదించారు. నల్లనువ్వులు ఒకవంతు, మినుములు రెండువంతులు వేయించి పిండిచేసి గేదె నెయ్యి బెల్లం కలిపి ఉండలుగా చుట్టి, ప్రతిదినం స్నానం చేసి పూజలో ఉండలు పెట్టి శనిగ్రహారాధన చేసి, పదకొండుమంది కుంటి, గుడ్డివారికి పంచిపెట్టవలెను. వరిపిండి పంచదార కలిపి చీమలకు చల్లవలెను. దీనివల్ల శనిగ్రహ బాధ తొలగునని పిప్పలాద మహర్షి చెబుతారు.

18. పూర్తిగా నలుపురంగు గుర్రం కాలుకు గల నాడా తెచ్చి నువ్వుల నూనెతో అభిషేకించి, శని స్తోత్రము చేసి, ఇంటి గుమ్మానికి కాని, తలుపుకి గానీ, పోర్టికోలో గానీ కట్టుటవల్ల శని గ్రహపీడ తగ్గుతుంది.

19. చేపలు పట్టే పడవ ముందరిభాగంలో వుండే పాత మేకులు, నల్లగుర్రపునాడా కలిపి కమ్మరి చేత రెండూ కలిపి కడియంగా చేయించి, దాన్ని చేతి కడియంగా కాని, మధ్యవ్రేలి ఉంగరంగా గాని ధరించుట వల్ల శనిగ్రహపీడ తొలగడమే కాక, శారీరక, లైంగిక పటుత్వం కూడా పెరుగుతుంది.

శనిగ్రహ స్నానం :

శనివారం నాడు, ఇనుము లేదా స్టీలు బిందెలో శుద్ధ జలమును నింపి, అందులో నల్లనువ్వులు, మినుములు, నల్లఉమ్మెత్త వేరులు, దర్భలు జమ్మి ఆకులు విష్ణుక్రాంత పుష్పాలు కలిపి, ధనురాకారంగా ముగ్గువేసి, దానిపై దర్భలు వేసి నీళ్ళ బిందెలు పెట్టి, శనిగ్రహ స్తోత్రమంత్రాలు పఠించి, బ్రాహ్మణుని ద్వారా మంత్రజలముతో మార్జన చేయించుకొని తరువాత శిరఃస్నానము చేయాలి. ఈ విధంగా అవసరాన్ని బట్టి 7శనివారములు ఇలా స్నానం చేస్తే బాధానివారణ కలుగుతుంది.

శనిగ్రహ ఉపవాసం :

శుక్లపక్ష ప్రథమ శనివారంనాడు ప్రారంభించి 19 శనివారాలు పాటించాలి. శనివారం ఉదయం శిరః స్నానంచేసి, నల్లటి దుస్తులు ధరించి శనితాంత్రిక మంత్రాన్ని మూడు లేదా పందొమ్మిది మాలలు జపించాలి. శక్తికి సంబంధించిన స్తోత్రాలు పఠించాలి. స్టీలు చెంబులో గంగాజలం, పంచదార, పాలు, నువ్వులు, లవంగాలు, నీలిపుష్పాలు కలిపి తూర్పుదిక్కుగా తిరిగి రావిచెట్టు మొదట్లో ధారపోయాలి. పగలంతా ఉపవాసం ఉండి ఆరోజు రాత్రి నువ్వులనూనె వేసుకొని పప్పు అన్నం మాత్రమే తినాలి. చివరి శనివారం శనిగ్రహ మంత్రంతో హోమం చేయాలి. అదేరోజు దీక్షానంతరం చెప్పులు, ఇనుపగిన్నెలు, నల్లటిబట్టలు దానం చేయుట మంచిది.

శనిగ్రహ దానం :

1) బ్రాహ్మణుడికి గానీ, నల్లనివ్యక్తికి గానీ నల్లనువ్వులు 800గ్రాములు లేదా 8కిలోలు, ఇనుము లేదా స్టీలు పళ్లెంలో లేదా ముదిరిన అరటి ఆకులో పోసి, దక్షిణ తాంబూలములు పెట్టి, శనిగ్రహాన్ని విధి విధానంగా పూజించి, మధ్యాహ్నం 1-30ని॥ల మధ్య వయసు గల బ్రాహ్మణుని పిలిచి పాదాలు కడిగి నమస్కరించి, పశ్చిమదిక్కుగా తిరిగి దానమీయాలి. ఈ విధంగా అవసరాన్నిబట్టి కొన్ని శనివారాలు చేయుటవల్ల నివారణ కలుగుతుంది.

రాహుగ్రహ బాధలు - పరిహారాలు

1. రాహువుకి అధిదేవత భూమి అని కొందరు, గోవులని కొందరు చెప్తారు అలాగే ప్రత్యధిదేవత సర్పములు కనుక అధిదేవత ప్రత్యధి దేవతాసహితంగా మంత్రపునశ్చరణ చేయటంవల్ల బాధా నివారణ కలుగుతుంది.
2. రాహువుకు అధిష్టానదేవత దుర్గాదేవి కనుక సప్తశతి పారాయణకాని, మంత్రంకాని, కవచంకాని పునశ్చరణ చేయటంవల్ల బాధానివారణ జరుగుతుంది.
3. తంత్రశాస్త్రం ప్రకారం రాహువుకు అంతరిక్ష అధిదేవత ఛిన్నమస్తాదేవి. ఈ శక్తి కంఠాన్ని ఖండించుకొని, రక్తధారల్ని త్రాగే శక్తిగా చిత్రీకరింపబడింది. ఛిన్నమస్తాదేవిని విధివిధానంగా ఉపాసించటంవల్ల రాహుగ్రహ దుష్పరిణామాలను నివారించబడతాయి. రాహుగ్రహం, ప్రమాదాలు, పూర్వజన్మ దష్కృత్యాలు, నాగదోషాలు, హఠాత్సంఘటనలు కల్గిస్తుంది.

రాహుగ్రహ ఉపవాసం :

రాహుగ్రహ ఉపవాసాన్ని శుక్లపక్ష శనివారం ప్రారంభించి 18 శనివారాలు ఉపవాస నియమం పాటించాలి. శనివారంనాడు శిరఃస్నానంచేసి, నల్లబట్టలు ధరించి, రాహుగ్రహతాంత్రిక మంత్రాన్ని మూడు లేదా పద్దెనిమిది మాలలు (108×18) జపించాలి. ఆ తరువాత నీటిలో గరికెలు, దర్భలు వేసి, రావిచెట్టు మొదట్లో ధారపోయాలి. శనివారం రాత్రికి తీపి కలిపిన చపాతీలు మాత్రమే భుజించాలి. భోజనానికి పూర్వం నువ్వులనూనెతో దీపం వెలిగించి రావిచెట్టు మొదట్లో పెట్టాలి. ఈ విధానంగా ఉపవాస నియమం పాటించటం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక లోపాలు తొలగిపోతాయి.

రాహుగ్రహ దానం :

రాహుగ్రహ బాధానివారణకు 10గ్రా॥ / 10కిలోలు మినుములు పాత ఇనుప పాత్రయందు కాని, తామరాకుయందు కాని పోసి, దక్షిణ తాంబూలములు పెట్టి, శనివారం మధ్యాహ్నం నడివయస్సు కల బ్రాహ్మణుని రావించి పాదప్రక్షాళనచేసి, రాహుజపము చేసి, పశ్చిమదిక్కుగా తిరిగి దానమీయవలెను. మినుములుతో పాటు ఎండుద్రాక్ష, కర్బూజపండు, బూడిదగుమ్మడి, గొడుగు, విసనకర్ర, నల్లని వస్త్రములు

మొదలగు వస్తువులు కూడ కలిపి దానము చేయుట మంచిది. ఈ విధంగా 10 శనివారాలు చేయటంవల్ల బాధానివారణ జరుగుతుంది.

రాహుగ్రహ స్నానం:

రాహుగ్రహ బాధా నివారణకు ఒక కొత్తకుండలో నీరుపోసి, అందులో గుగ్గిలము, ఇంగువతాళకము, మణిశిల, గరిక మొదలగు ఓషధులు వేసి, శూర్పాకారంగా (చేట) ముగ్గువేసి, దర్భలు వేసి, అందులో కుండపెట్టి, దొరికితే గేదె కొమ్మునిండా నీరుపోసి పెట్టి, రాహుగ్రహ మంత్రజపం, స్తోత్రంచేసి ముందుగా గేదె కొమ్ములోని నీటితో మార్జన చేసుకొని, పిదప కుండలోని నీటితో శిరఃస్నానము దక్షిణముఖంగా నిలబడి చేయాలి. ఈ విధంగా 10 శనివారాలు చేయుటవల్ల రాహుగ్రహ బాధానివారణ జరుగుతుంది.

రాహుగ్రహ బాధని నివారించే మరికొన్ని ప్రక్రియలు

1. రాహుగ్రహం వల్ల క్షయరోగం సంభవిస్తే వందగ్రాముల బార్లీ గోమూత్రంతో కడిగి పారుతున్న నీటిలోనికి ధారపోయాలి. అదే విధంగా గోమూత్రము పుక్కిలించుట కూడ చేయాలి. ఈ విధంగా కనీసం 18 రోజులు చేయుటవల్ల నివారణ కలుగును.
2. 100 గ్రాముల బార్లీ తీసుకొని పాలతో కడిగి పారుతున్న నీటిలోనికి ధారపోయవలెను. ఈ విధంగా కనీసం నాలుగురోజులు చేయాలి.
3. శనివారం నాడు ప్రారంభించి వరుసగా 18 రోజులు పారుతున్న నీటిలోనికి రోజుకొక కొబ్బరికాయ ధారపోయుటవల్ల నివారణ కల్గును.
4. ముల్లంగి లేదా సత్తుదుంపలు రోజుకు నాలుగువంతున ఎనిమిది రోజులు దానం చేయాలి. అదేవిధంగా కొద్దిపాటి బొగ్గులు నీటిలోనికి ధారపోయుట చేయుటవల్ల నివారణ కలుగుతుంది.
5. మేషరాశిలో కాని, జన్మలగ్నమందు కాని రాహువున్నప్పుడు అనేక రకాల శారీరక, మానసిక బాధలు కల్గిస్తాడు. అటువంటప్పుడు నీళ్లలో కొద్దిగ పాలు కలిపి 43 రోజులు క్రమంగా స్నానం చేయాలి.

6. అష్టమరాహువు పీడ కల్గేటప్పుడు చెల్లని నాణాలను పారుతున్న ఏటిలోనికి ధారపోయుట వల్ల నివారణ కల్గును.

7. కర్కాటకరాశిలో కాని, లగ్నం నుండి చతుర్థంలోకాని రాహువున్నచో సంతానానికి విద్యాబుద్ధులందు, గృహయజమానికి స్వంత ఇల్లు లేదా వాహనాలు లేదా తల్లి ఆరోగ్యం మున్నగు విషయాలపై ప్రభావం ఎక్కువ చూపెడతాడు. అటువంటప్పుడు 400 గ్రాముల బాదం పిక్కలు పారుతున్న ఏటిలో ప్రతి శనివారం ధారపోయుటవల్ల నివారణ కలుగుతుంది.

8. పడుకొనే గదిలో నెమలిఫించాన్ని కనబడేటట్లు పెట్టి, తెల్లవారుజామున లేవగానే చూచుటవల్ల రాహుగ్రహ బాధా నివారణ కలుగుతుంది.

9. లగ్నం నుండి ద్వాదశ స్థానంలోకాని, మీనరాశిలో కాని రాహువున్నచో సుఖమైన నిద్ర, భోజనం వుండదు. పీఠికమీద అనేక అవయోగాలు కల్గిస్తాడు. పగడం తలక్రింద పెట్టుకొని నిద్రించుట, ఆవులకు బిస్కట్లు పెట్టుటవల్ల, నెలకొకసారి శనివారపూట మనిషి బరువెత్తు బొగ్గులు పారే నీటిలో ధారపోయుటవల్ల రాహుగ్రహబాధా నివారణ జరుగుతుంది.

రాహుకాలం :

రాహుకాలం వారంలో ప్రతిరోజు ఒకటిన్నర గంటల సమయం ఉంటుంది. ఆ సమయంలో చేసే పనులకు ఆటంకం కలుగుతుందని విశ్వసిస్తారు కనుక ముఖ్యమైన పనులైతే ఆ సమయంలో చేయరు. కాని బాధానివారణ కొరకు రాహుకాలంలో పూజలు నిర్వహిస్తారు. దుర్గాదేవికి రాహుకాలంలో నిమ్మడిప్పలో నూనెపోసి దీపం వెలిగిస్తారు. ఆదివారం సాయంత్రం 4.30 (నాలుగున్నర) గంటల నుండి 6 గంటల వరకు, సోమవారం ఉదయం 7.30 (ఏడున్నర) 9 వరకు, మంగళవారం 3 గంటల నుండి 4.30(నాలుగున్నర) గంటల వరకు, బుధవారం 12 గంటల నుండి 11.30(ఒకటిన్నర), గురువారం 1/2 గంటల నుండి 3 గంటల వరకు, శుక్రవారం 10 1/2 గంటల నుండి 12 గంటల వరకు, శనివారం 9 గంటల నుండి 101/2 గంటల వరకు రాహుకాలం ఉంటుంది.

కేతుగ్రహ బాధలు - పరిహారాలు

1. కేతువుకధిదేవత చిత్రగుప్తుడు, ప్రత్యధిదేవత బ్రహ్మ. అధిదేవతా, ప్రత్యధిదేవతా సహితంగా జపహోమాదులు చేయటంవల్ల బాధానివారణ జరుగుతుంది.
2. గణపతి కేతువుకు అధిష్ఠాన దేవత కనుక గణపతిని విధి విధానంగా పూజించటంవల్ల నివారణ పొందవచ్చును. గణపతి పూజ అనేక విధాలుగా వుంటుంది. గరికెలతో పూజించుట, సింధూరంతో పాదాలు మొదలుకొని శిరసు వరకు బొట్టులు పెట్టి పూజించుట, ప్రతిరోజు లడ్డూ నైవేద్యంపెట్టి పూజించుట, తెల్లజిల్లేడు లేదా పగడంతో విగ్రహం చేయించి ప్రతిష్ఠ చేసి పూజించుట అనే పద్ధతులు వున్నాయి. వీటిలో ఏదో ఒక విధానాన్ని అనుసరించుట వల్ల నివారణ కలుగుతుంది.
3. బాబాలు, యోగులు, సిద్ధులు, తపస్సు చేసేవారు కేతుగ్రహ అనుగ్రహం లేకపోతే ఫలసిద్ధి పొందలేరు.
4. ధూమవతీదేవి కేతువుకు అంతరిక్ష అధిదేవత. తంత్రశాస్త్రం నిర్దేశించింది. మంత్రశాస్త్రంలో ఈ దేవతకు ప్రత్యేక స్థానం వున్నది. ఈ ధూమావతీదేవి కరుణ లేనిదే మహాత్ములు కూడ మృగాల్లా ప్రవర్తిస్తారు కనుక శ్రీ ధూమవతీ దేవిని ఆరాధించటం వల్ల కేతుగ్రహ బాధానివారణ పొందవచ్చును.

కేతుగ్రహ ఉపవాసం :

1. కేతుగ్రహ ఉపవాసాన్ని శుక్లపక్ష శనివారం ప్రారంభించి 18 శనివారాలు ఉపవాస నియమం పాటించాలి. ప్రతి శనివారం నల్లబట్టలు ధరించి, కేతుగ్రహ తాంత్రిక మంత్రాన్ని 18 మాలలు (108×18) లేదా కనీసం మూడు మాలలు జపించాలి. ఆ తరువాత చెంబుతో నీరు తీసుకొని అందులో గరికలు, దర్భలు కలిపి రావిచెట్టు మొదట్లో పోయాలి. సాయంత్రం దీపాలు పెట్టే సమయానికి రావిచెట్టు మొదట్లో దీపం పెట్టాలి. పగలంతా ఉపవసించి, రాత్రికి తీపి కలిపిన గోధుమ రొట్టె లేదా చపాతీ భుజించాలి.

కేతుగ్రహ దానం :

1. ఉలవలతో పాటు ఖర్జూరం, రేగిపండ్లు, దమనం, మోదుగ సమిదలు, మల్లె సంపెంగ పూలు, రాగి పాత్రలు కూడ దానం చేయవచ్చు.
2. కేతుగ్రహ బాధానివారణకు 70గ్రా॥ / 700గ్రా॥ / 7కిలోలు ఉలవలను శుభ్రంచేసి, రాగిపాత్రలో కాని, మోదుగు ఆకుల విస్తరిలో కాని పోసి, కేతుగ్రహ పూజచేసి, మంగళవార ఉదయంపూట వయసులో వున్న బ్రాహ్మణునకు పాద ప్రక్షాళన చేసి కేతు మంత్రము జపిస్తూ దాన మీయవలెను. ఈ విధంగా ఏడు మంగళవారాలు చేయాలి.

కేతుగ్రహ స్నానం :

కేతుగ్రహ బాధానివారణకు ఒక కంచు పాత్రలో నీరుపోసి, మేకపాలు, దర్భలు, యవలు, కుంకుమపువ్వు, మోదుగ చిగుళ్లు, వేపచిగుళ్లు, వస మొదలగు వస్తువులు కలిపి ధ్వజాకారంగా ముగ్గువేసి, దానిపై నీటి పాత్రను పెట్టి, విధివిధానంగా కేతువును పూజించి, బ్రాహ్మణుని అనుజ్ఞ పొంది వాయవ్యదిక్కుగా తిరిగి శిరఃస్నానము చేయాలి. ఈ విధంగా ఏడు మంగళవారాలు కాని మంగళవారం మొదలుపెట్టి ఏడు రోజులు వరుసగా కాని చేయుటవల్ల కేతుగ్రహ బాధానివారణ జరుగుతుంది.

కేతుగ్రహ బాధని నివారించే మరికొన్ని ప్రక్రియలు

1. మూత్రకోశానికి గాని, పాదాలకుకాని, వ్యాధులు కేతువు వల్ల కలిగితే తెల్లటి పట్టుదారాన్ని కాని, సన్నటి తాడుకాని రెండు పాదాల బొటన వ్రేళ్ళకు కట్టుకుంటే బాధానివారణ కలుగును.
2. కేతువుగ్రహ దోషం వల్ల సంతానానికి రోగం కల్గినపుడు నది, ఏరు లేదా కాలువ నుండి మన్ను తెచ్చి శరీరమంతా పిల్లలకు పట్టించి, ఒక గంట తరువాత మంచినీళ్ళతో స్నానం చేయించాలి. ఈ విధంగా 43 రోజులు చేయుటవల్ల బాధానివారణ జరుగుతుంది.
3. జాతక చక్రంలో కేతువు బాధాస్థానంలో వున్నప్పుడు కొడుకులపై ప్రభావం చూపెడతాడు. అటువంటప్పుడు దేవాలయానికి కంబళికాని, దుప్పటికాని దానం చేయుట వల్ల బాధానివారణ జరుగుతుంది.

4. కేతువు ఆధీనంలో పెళ్లిలో అత్తవారిచ్చిన మంచం వుంటుంది. కావున దాన్ని అన్నివేళలా వాడుటవల్ల, ముఖ్యంగా ప్రసవ సమయంలో కలిగే బాధల నుంచి నివారణ పొందవచ్చును.
5. జాతకచక్రంలో ఆరవస్థానంలో కేతువుండుట దైవిక కర్మలకు మంచిదైనప్పటికి, ఇహలోక సంబంధాలు చెడిపోతాయి. కేతువు అనేక రకాల వేదనలు కల్గిస్తాడు. అటువంటప్పుడు పెళ్లిరోజు అత్తవారు పెట్టిన ఉంగరాన్ని ఎడమచేతికి ధరిస్తే బాధానివారణ కలుగుతుంది.
6. వ్యయంలో కేతువున్నపుడు ఆధ్యాత్మికంగా యోగాలు పట్టినా, కుటుంబ వ్యవహారాల్లో చికాకు కల్గిస్తాడు. అటువంటప్పుడు చేతి బొటనవ్రేలు పాలల్లో ముంచి చప్పరించుట వల్ల ఫలితముంటుంది. ఈ ప్రక్రియ మగసంతాన మున్నవారు చేయుట వల్ల ఎక్కువ ఫలితముంటుంది.
7. కేతువుకు ప్రీతి కల్గించే మోదుగుపూలు, గరిక, దమనము, ఉలవలు వాటితో చేసే పదార్థాలు, జీలకర్ర, ఖర్జూరము, రేగిపండ్లు, సపోటా, కమలాఫలాలు, మేకపాలు, కుంకుమపువ్వు, ఏడువత్తుల దీపం, ఆదివారం పూట వసధూపము, మిరియాలు, తగరము, కంచు, వేపాకులు, కరివేపాకు, కంద, కర్రపెండలం మొదలైన వస్తువుల్ని దానం చేయటంవల్ల, పూజలో హోమంలో వాడటంవల్ల బాధానివారణ జరుగుతుంది.
8. కుక్కలపై కేతువు ప్రభావం ఎక్కువగా వుంటుంది. ముఖ్యంగా తెలుపు నలుపు కుక్కలపై ఎక్కువగా వుంటుంది. కాబట్టి కుక్కలకు ప్రతిరోజు ఆహారం పెట్టటంవల్ల నివారణ పొందవచ్చు.
9. సప్తమంలో కేతువు వల్ల సంసారిక జీవితంలో అనేక అసంతృప్తులుంటాయి. అటువంటప్పుడు నాలుగు బొగ్గుముక్కలు, నాలుగు నిమ్మకాయలు కలిపి పారుతున్న నీటిలోనికి ధారపోయాలి. ఈ విధంగా నాలుగురోజులు చేయుటవల్ల బాధా ఉపశమనం కలుగుతుంది.

నవగ్రహ దోష నివారణకు ధరించాల్సినవి

సూర్యగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

నవగ్రహాలలో మొదటి గ్రహం అయిన సూర్యుడి బాధానివారణ కోసం కెంపు రత్నాన్ని ధరించాలి. ఈ రత్నాన్ని ఆదివారం రవిహోరలో ధరిస్తే ఎంతో మంచిది. ఈ రత్నధారణ వల్ల అధికారం పదవి లభిస్తుంది. శరీరస్వస్థత రక్తశుద్ధి కలిగిస్తుంది. కెంపుల్లో వివిధ రకాలున్నాయి. రత్నం నాణ్యతని బాగా పరీక్షించి శుభ ముహూర్తంలో జ్యోతిష్య పండితుడ్ని సంప్రదించి శాస్త్రబద్ధంగా రత్నాన్ని ధరించాలి. కెంపు ఖరీదైన రత్నం. దీనికి ప్రత్యామ్నాయంగా 'గార్నెట్ స్టోన్'ని ధరించవచ్చు.

ధరించాల్సిన రుద్రాక్షలు

సూర్యగ్రహ బాధా నివారణకు ద్వాదశ ముఖి రుద్రాక్షను ధరిస్తే మంచిది. సంఖ్యా శాస్త్ర పరంగా అయితే ఏకముఖి రుద్రాక్షని ధరించాలి. ఈ రుద్రాక్ష ధారణ వల్ల సూర్యగ్రహ బాధా నివృత్తి జరిగి, ధరించినవారికి శుభఫలితాలు జరుగుతాయి. ఈ రుద్రాక్షను స్త్రీలు కూడా ధరించవచ్చు.



చంద్రగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

నవరత్నాలలో ముత్యం చంద్రునికి సంబంధించింది. కర్కాటకం చంద్రుడి రాశి, శ్రవణం, రోహిణి, హస్త చంద్రుడి నక్షత్రాలు. కనుక ఈ నక్షత్ర రాశి జాతకులు జాతి ముత్యాన్ని ధరించాలి. ముత్యం ధరిస్తే మనశ్శాంతి లభిస్తుంది. ఇది మన మనస్సులోని భావోద్వేగాలపై ప్రభావం చూపిస్తుంది. మానసిక దోషాల్ని పోగొడుతుంది. ముత్యపు ఉంగరం వెండితో చేయించాలి.

ధరించాల్సిన రుద్రాక్షలు

ద్విముఖ రుద్రాక్ష అనగా – రెండు ముఖాలున్న రుద్రాక్ష. దీనికి రెండు చారలుంటాయి. ఇది అర్ధనారీశ్వర రూపం. దీన్నే 'శివ–కామేశ్వరి' రుద్రాక్ష అని కూడ అంటారు. ఆధ్యాత్మిక సాధనలో ద్విముఖి రుద్రాక్ష అద్భుత ఫలితాలను ఇస్తుంది. సోమవారం లేదా ఏకాదశిరోజున (లేదా శుక్రవారం, పౌర్ణమి తిధులలో) బంగారం, వెండి, రాగి, లేక పట్టుదారంతో దీనిని ధరించవచ్చు.

కుజగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

నవగ్రహాలలో మూడవగ్రహం అయిన కుజుడి బాధానివారణ కోసం పగడాన్ని ధరించాలి. పగడాలకు అధిపతి కుజుడు. మృగశిర, చిత్త, ధనిష్టా నక్షత్రాలలో జన్మించినవారు పగడాన్ని ధరించాలి. జాతకంలో కుజుడు శత్రుస్థానంలో, నీచస్థానంలో, అష్టమస్థానంలో లేక అస్తంగతుడై ఉన్నప్పుడు, బాధానివారణ కోసం పగడాన్ని ధరించాలి. కుజుడు సోదరభావకారుకుడు, అందువలన పగడాన్ని ధరిస్తే తోబుట్టువులతో తగాదాలు తగ్గిపోతాయి. కొంతమందికి భూసంబంధమైన సమస్యలు పట్టి పీడిస్తుంటాయి. అలాంటివారు పగడపు హారాలు, ఉంగరాలను ధరిస్తే ఫలితం వుంటుంది. ఈ పగడాన్ని జ్యోతిషుల్ని సంప్రదించి శుభముహూర్తంలో శాస్త్రోక్తంగా ధరిస్తేనే శుభఫలితాలు లభిస్తాయి.

ధరించాల్సిన రుద్రాక్షలు

కుజ గ్రహ బాధానివృత్తికోసం ఆరుముఖాల రుద్రాక్షను ధరించాలి. ఇది ఆరుముఖాల కలిగిన కుమారస్వామికి గుర్తు. దీన్ని ధరిస్తే ఆరోగ్యం సంపద కలుగుతాయి. అలాగే స్త్రీలకు సంబంధించిన వ్యాధులు కూడా తగ్గుతాయి. సంఖ్యాశాస్త్రం పరంగా కుజుడు సంఖ్య 9 కావున నవముఖీ రుద్రాక్షను కూడా ధరించవచ్చు.




బుధగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

బుధుని రత్నం పచ్చ. దీన్ని మరకతం అని కూడా వ్యవహరిస్తారు. ఇందులో గరుడుపచ్చ ముదురాకు పచ్చ, నెమలిపింఛపురంగు పచ్చ ... ఇలా పలురకాలున్నాయి. మిధున, కన్యారాశులు, ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్రాలు 5, 14, 23 తేదీలు బుధునికి వర్తిస్తాయి. మే 21 జూన్ 20 మధ్య ఆగస్టు 24 సెప్టెంబర్ 23 మధ్య జన్మించినవారు జాతిపచ్చ ధరించవచ్చు. ఇది ఆలోచనా ధోరణిని ప్రభావితం చేస్తుంది. మేధస్సును మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తి వృద్ధి చేస్తుంది. మధుమేహ రోగులకు ఉపయోగిస్తుంది. గుండె, కాలేయం, క్లోమగ్రంధులు, మూత్ర పిండాలకు సంబంధించిన రోగాలను అదుపు చేస్తుంది. అనుభవజ్ఞులైన జ్యోతిష్యులను సంప్రదించి బుధవారం, బుధహోరలో శాస్త్రోక్త పద్ధతిలో దీనిని బంగారం లేదా వెండి ఉంగరంలో ఉంచి ధరించాలి.

ధరించాల్సిన రుద్రాక్షలు

దశ ముఖ రుద్రాక్ష విష్ణు స్వరూపం. బుధగ్రహ బాధానివారణకు బుధుడికి అధిష్ఠానదేవత అయిన విష్ణువుకి ప్రతీకగా 10 ముఖాలు గల దశముఖ రుద్రాక్షని ధరించాలి. సంఖ్యా శాస్త్రం పరంగా బుధుడి సంఖ్య 5 కాబట్టి పంచముఖ రుద్రాక్షను కూడా ధరించవచ్చు. ఈ రుద్రాక్ష ధారణ వల్ల దుష్టశక్తి ప్రభావం తొలగి అఖండ ఐశ్వర్యం సంప్రాప్తిస్తుంది. నిరుద్యోగులకు ఏదో ఒక మేలు చేకూరుతుంది. కీర్తి అందిస్తుంది. అవాంతరాలను అధిగమింపజేస్తుంది. ఈ రుద్రాక్ష చూర్ణం పాలలో మరగించి సేవిస్తే శ్లేష్మ సంబంధ రోగాలు తగ్గుతాయి. అన్నిరకాల మానసిక రుగ్మతలు తొలగి ఆత్మశక్తి కార్యకౌశల్యం ఇనుమడిస్తాయి. ఇది ధరించిన వారికి రాజకీయంగా పేరు ప్రఖ్యాతలు లభిస్తాయి.




గురుగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

పుష్యరాగం గురు గ్రహరత్నం. సాధారణంగా పుష్యరాగం పసుపుతోపాటు తెలుపురంగులోనూ లభిస్తుంది. తెల్లనిదానిని శ్వేతపుష్యరాగం అని పసుపు రంగు రత్నాన్ని కనకపుష్క రాగం అని అంటారు. ఇది పసుపువన్నె గల జాతిరాయి. ఇంగ్లీషులో దీన్ని ఎల్లో సఫైర్ అనీ, టోపాజ్ అనీ వ్యవహరిస్తారు. పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్రాలు గురునికి సంబంధించినవి కనుక ఆయా రాశుల్లో / జన్మతేదీల్లో / నక్షత్రాల్లో జన్మించినవారు ఈ రత్నాన్ని ధరిస్తే మంచిది. అంతేగాక-జననకాలంలో గురుగ్రహం దుష్టస్థానాల్లో / దుర్బలరాశుల్లో ఉన్నవారు, గురుమహాదశ నడుస్తున్నవారు పుష్యరాగం ధరించవచ్చు. ఈ రత్నాన్ని గురువారంనాడు గురు హెూరలో శివాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం చేయించి ఆ తరువాత ధరిస్తే మంచిది.

గురుగ్రహ బాధా నివారణకు ధరించాల్సిన రుద్రాక్ష - దశముఖి

గురుగ్రహ బాధా నివారణకు దశముఖి రుద్రాక్షను ధరించాలి సంఖ్యా శాస్త్రం పరంగా గురుగ్రహం సంఖ్య 3 కాబట్టి త్రిముఖి రుద్రాక్షను కూడా ధరించవచ్చు. ఈ రుద్రాక్ష ధారణ వల్ల, వృత్తి, ఉద్యోగాల్లో ఉన్నవారికి సర్వతోముఖాభివృద్ధిని

కలుగుతుంది. పోటీ పరీక్షలకు వెళ్ళే వారికి, పరిపాలనా సంబంధ వృత్తులు / ఉద్యోగాలు చేస్తున్నవారికి దశముఖ రుద్రాక్ష ధారణ శుభఫలితాన్ని అందిస్తుంది. వైద్యులు, లేదా వైద్య రంగానికి చెందిన వారికి ఈ రుద్రాక్ష గొప్ప ప్రభావాన్ని చూపిస్తుంది.



శుక్రగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

నవగ్రహాలలో ఆరవగ్రహం అయిన శుక్రుడి బాధానివారణ కోసం వజ్రం రత్నాన్ని ధరించాలి. ఈ వజ్రాన్ని ఉత్తరాభాద్ర నక్షత్రం రోజు, లేదా శుక్రవారం-శుక్రహోరలో ధరిస్తే ఎంతో మంచిది. వజ్రం ఖరీదైన రత్నం కావున ప్రత్యామ్నాయంగా అమెరికన్ డైమండ్‌గాని, స్పటికాన్నిగాని ధరించ వచ్చు.

ధరించాల్సిన రుద్రాక్ష

శుక్రగ్రహ బాధా నివారణార్థం ఏడు ముఖాలు గల సప్తముఖి రుద్రాక్షని ధరించాలి. ఇది ఏడు చారలు కలిగి ఉంటుంది. దీన్ని లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. సప్తఋషుల స్వరూపంగా కూడా భావిస్తారు. ఇది మన్మధుడికి ప్రతీక. ఈ రుద్రాక్ష ధారణవల్ల మనశాంతి కలుగుతుంది.



శనిగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

నవగ్రహాలలో ఏడవగ్రహం అయిన శనీశ్వరుడి బాధానివారణ కోసం నీలం రత్నాన్ని ధరించాలి. ఈ నీలాన్ని శ్రవణా నక్షత్రం రోజు ధరిస్తే ఎంతో మంచిది. ఈ రత్నధారణ వల్ల మనశ్శాంతి, ఆరోగ్యం లభించి పక్షవాతం, కీళ్ళనొప్పులు, దృష్టిబాధాం వంటివి తొలగిపోతాయి. నీలరత్నాల్లో ఇంద్రనీలం, మయూరనీలం అని రెండు రకాలున్నాయి. రత్నం నాణ్యతని బాగా పరీక్షించి శుభ ముహూర్తంలో జ్యోతిష్య పండితుడ్ని సంప్రదించి రత్నాన్ని ధరించాలి.

ధరించాల్సిన రుద్రాక్ష

శనిగ్రహ బాధా నివారణకు భైరవీ స్వరూపమైన 9 ముఖాల రుద్రాక్షను ధరించాలి. సంఖ్యా శాస్త్ర పరంగా అష్టముఖి కూడా ధరించవచ్చు. ఈ రుద్రాక్షల ధారణ వల్ల శనీశ్వరుడి బాధా నివృత్తి జరిగి, ధరించినవారికి ఎన్నో శుభఫలితాలు జరుగుతాయి. ఈ రుద్రాక్షను స్త్రీలు కూడా ధరించవచ్చు.



రాహుగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

నవగ్రహాలలో ఎమిదవగ్రహం అయిన రాహుగ్రహ బాధానివారణ కోసం గోమేధిక రత్నాన్ని ధరించాలి. ఈ రత్నాన్ని శనివారం నాడు రాహు కాలంలో శాస్త్రోక్తంగా పూజించి ధరించాలి. ఆరుద్ర, స్వాతి, శతభిష నక్షత్రజాతకులు, 4-1-22-31 తేదీలలో జన్మించినవారు రాహుదశ నడుస్తున్నవారు, సాయన కుంభ సూర్యరాశి జాతకులు, జనవరి 21, ఫిబ్రవరి 19 మధ్య పుట్టినవారు గోమేధికాన్ని ధరించవచ్చు. ఇది గోమూత్రం రంగులో ఉంటుంది. తేనెరంగులో ఉండేవి కూడా లభ్యం అవుతాయి. నిపుణలచేత పరీక్షింపచేసి ధరించాలి. బంగారంలో పొదిగిన గోమేధికాన్ని మధ్యవ్రేలికి మంగవారం ఉదయం సూర్యోదయ వేళలో ధరించడం ఉత్తమం. ధనలాభానికి, అధికారప్రాప్తికి ఈ గోమేధికరత్నధారణ ఉపకరిస్తుంది. ఆయురారోగ్య భాగ్యాలకు గోమేధిక ధారణ చాలా ప్రశస్తుమైనదని జ్యోతిషట గ్రంథాలు చెబుతాయి.

ధరించాల్సిన రుద్రాక్ష


రాహు గ్రహ బాధా నివారణకు సప్తముఖి రుద్రాక్షను ధరించాలి. ఇది ఏడు చారలు కలిగి ఉంటుంది. ఈ రుద్రాక్ష ధారణ లక్ష్మీ కటాక్షదాయకం. ఆధ్యాత్మిక పరంగా దీనికి విశేష ప్రాముఖ్యం ఉంది. చిత్త ప్రశాంతతకు, సత్సంకల్పసిద్ధికి, ప్రేమ అనురాగవృద్ధికి, పౌరుష ధైర్యాలకు ఈ రుద్రాక్ష ధరించవచ్చు. సంఖ్యా శాస్త్రపరంగా రాహు సంఖ్య 4 కావున చతుర్ముఖి రుద్రాక్షను కూడా ధరించవచ్చు. శుక్రవారంరోజున / శనివారంరోజున ఈ రుద్రాక్షను పాలు- పంచామృతాలతో అభిషేకించి రాహుగ్రహ మంత్రాన్ని 108 సార్లు పఠించి ధరించాలి.

కేతుగ్రహ అనుగ్రహం కోసం ధరించాల్సిన రత్నం

నవగ్రహాలలో తొమ్మిదవగ్రహం అయిన కేతువు బాధానివారణ కోసం వైఢూర్యం రత్నాన్ని ధరించాలి. ఈ వైఢూర్యాన్ని అశ్విని, మఖ మూల నక్షత్రాలలో శనివారం రోజు శనిహోరలో ధరిస్తే ఎంతో మంచిది. జ్యోతిష్యుల్ని సంప్రదించి అసలైన రత్నాన్ని పరీక్షించి శాస్త్రోక్తంగా ధరిస్తేనే సత్ఫలితం లభిస్తుంది.

ధరించాల్సిన రుద్రాక్ష

కేతుగ్రహ బాధా నివారణకు గణపతి ప్రతిరూపమైన అష్టముఖి రుద్రాక్షను ధరించాలి. సంఖ్యా శాస్త్ర పరంగా కేతువు సంఖ్య 7 కావున సప్తముఖిని కూడా ధరించవచ్చు. ఈ రుద్రాక్ష ధరించేవారికి అన్ని కార్యాలు ఎటువంటి విఘ్నం లేకుండా సఫలమౌతాయి. అంతే కాక ధరించిన వారికి ఆధ్యాత్మిక తత్వం పెంపొంది ధర్మపురుషులుగా కీర్తి పొందుతారు.





నవగ్రహ విశేషాలు

గ్రహములు	కులము	గోత్రములు	వర్ణములు	ముఖములు	ధాన్యములు	సమిధలు	రత్నములు	ఆసనములు
సూర్యుడు	క్షత్రియ	కాశ్యప	రక్తవర్ణం	తూర్పు	గోధుమలు	జిల్లేడు	కెంపు	వర్తులం
చంద్రుడు	వైశ్యుడు	ఆత్రేయ	శ్వేతవర్ణం	పడమర	బియ్యము	మోదుగ	ముత్యము	సమచతురస్రం
అంగారకుడు	క్షత్రియ	బారధ్వాజ	రక్తవర్ణం	దక్షిణం	కందులు	చంద్ర	పగడము	త్రికోణము
బుధుడు	వైశ్య	ఆత్రేయ	పీతవర్ణం	ఉత్తరము	పెసలు	ఉత్తరేణి	పచ్చ	బాణం
బృహస్పతి	బ్రాహ్మణ	అంగీర	కనకవర్ణం	ఉత్తరము	శనగలు	రావి	పుష్యరాగం	దీర్ఘచతురస్రం
శుక్రుడు	బ్రాహ్మణ	భార్గవ	శ్వేతవర్ణం	తూర్పు	బొబ్బర్లు	మేడి/అత్తి	వజ్రం	పంచకోణం
శని	శూద్ర	కాశ్యప	నీలవర్ణం	పడమర	నువ్వులు	జమ్మి	నీలం	ధనుస్సు
రాహువు	చండాల	పైఠీన	ధూమ్రవర్ణం	దక్షిణము	మినుములు	గరిక	గోమేధికం	చేట
కేతువు	చండాల	జైమిని	చిత్రవర్ణం	దక్షిణము	ఉలవలు	దర్భ	వైడూర్యం	ధ్వజము